కాకాని చక్రపాణి నవలలు/ నవలికలు

సంపుటం–8

# కాటేసిన అమృతం

(రాజకీయ, సాంఘిక నవల)

**కాకాని చక్రపాణి**

ఎమెస్కో

# కాటేసిన అనృతం

## -1-

**"గాం**ధీ చెప్పినట్లు కాంగ్రెసు పార్టీ నడుస్తున్నదా? గాంధీగారు గ్రామస్వరాజ్య మన్నాడు, ఎందుకన్నాడు? ఒకప్పుడు మనది స్వయంసమృద్ధ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ. ముస్లింలొచ్చారు, వాళ్ళు తమ భోగభాగ్యాలకోసం, తమ విషయవాంఛా పరితృప్తికోసం పన్నుల రూపంలో గ్రామాలను దోచుకుని నగరాల్లో సెటిలయ్యారు; ఇంగ్లీషువాళ్ళు వచ్చారు. వాళ్ళు వర్తకులు, నిజానికి వర్తక జాతి, ఇంగ్లీషుకూడ ఫ్రెంచిభాషంత సాంస్కృతిక భాష కాదు. అందుకనే భారతదేశాన్ని మార్కెట్టుగా మార్చేశారు. గ్రామాలు ముడిసరుకులను వాళ్ళకు సప్లయిచెయ్యాలి, వాళ్ళు వాటిని తీసుకువెళ్ళి తయారయిన వస్తువులను ఇండియాకు తీసుకువస్తారు. వాటిని మన పట్నాల, నగరాల జనం కొనాలి. మనం దేశంలో ఏదీ ఉత్పత్తి చేయకుండా మన పరిశ్రమల నడుములు విరగ్గొట్టారు. మన నేతగాళ్ళ వేళ్ళు విరగ్గొట్టిన విషయం అందరికీ తెల్సిన సంగతే! అందుకే తిరిగి స్వయంసమృద్ధి కలిగిన గ్రామస్వరాజ్యం కావాలని గాంధీ మొత్తుకుంటే, నెహ్రూగారు మనకు తెచ్చిందేమిటి? సర్వసత్తాక, ప్రజాస్వామ్య రిపబ్లిక్! ఆ తర్వాత, ఇందిరాగాంధీ అత్యవసర పరిస్థితిని విధించాక, 1976 నవంబర్ 2న దానికి 'సామ్యవాద, లౌకికవాద' పదాలను జోడించటం జరిగింది. 1977లో అధికారం చేపట్టిన జనతా ప్రభుత్వం అంతకుముందు రాజ్యాంగానికి చేసిన సవరణలను 44వ రాజ్యాంగ సవరణద్వారా రద్దు చేసింది కానీ, విచిత్రంగా ఈ పదాలను ముట్టుకోలేదు. మనకు ప్రబోధించే ఈ సెక్యులరిజం ఎక్కడిది? పాశ్చాత్యంనుండి దిగుమతి అయింది.

అక్కడ మతం రాజకీయాల్లో విపరీతంగా జోక్యం చేసుకున్నది. రాజులు దానిమీద తిరగబడి, రాజకీయాల్లో మత జోక్యం ఉండకూడదన్నారు. ఇంగ్లాండు రాజు ఎనిమిదవ హెన్రీకీ, పోప్‌కీ ఎందుకు పేచీ వచ్చింది? దాసీ దాని వ్యామోహంలో పడి, 'భార్య కాథరిన్‌కు విడాకులివ్వాలి, నువ్వు దానికి అనుమతించా'లని కోరాడు పోప్‌ను హెన్రీ. ఆమె కాథరిన్ క్రైస్తవసామ్రాజ్య చక్రవర్తికి మేనత్త కనుక, హెన్రీ ఆమెకు విడాకులివ్వటానికి తను అంగీకరిస్తే, చక్రవర్తికెక్కడ కోపం వస్తుందేమో నని పోప్‌గారు అంగీకరించలేదు. అదే చర్చి ఆఫ్ ఇంగ్లాండ్ ప్రాదుర్భావానికీ, రాజకీయాల్లో పోప్ జోక్యం పనికిరాదని చట్టం అవతరించటానికీ కారణమైంది. ఇంగ్లాండు రాజు ఎనిమిదవ హెన్రీ రాజ్యానికే గాక, చర్చికి కూడా తనే సర్వాధికారి అని ప్రకటించుకున్నాడు. హి డిక్లేర్డ్ హిమ్‌సెల్ఫ్ ద హెడ్ ఆఫ్ ది టెంపోరల్ అండ్ స్పిరిచుయల్ పవర్స్. దాన్నే సర్వాధికార శాసన (the Act of Supremacy) మంటారు. చివరకు, ఇంగ్లాండు జనం కాథలిక్ మతంనుండి, ప్రొటెస్టెంట్ మతానికి మొగ్గటానికీ అది దారి తీసింది. పాశ్చాత్య దేశాల రాజకీయాల్లో పోప్ ఆధిపత్యం తగ్గించటానికి లౌకికవాదం తీసుకువచ్చారు...."

"మనకు మాత్రం నష్టమేముంది? ఇన్ని మతాలున్న మన దేశంలో, సర్వమత సమానత్వం పాటించే ఉద్దేశంతో మతనిరపేక్షవాదం ప్రవేశ పెట్టారు. లౌకికవాదం మనకు చేసిన చెరుపేం లేదు" అన్నాడు ప్రభునారాయణ.

"కానీ, ఆ దేశాలేవీ సెక్యులర్ రాజ్యాలు కావు. అధికసంఖ్యాకుల మతానికే అక్కడ ప్రాముఖ్యం. కొంత మేరకు ఇతరమతాలవారి కార్యకలాపాలనుకూడా వాళ్ళు సహిస్తారు. అక్కడ హిందువులుగానీ, ముస్లింలుగానీ ఉంటే, హిందూ లేక ముస్లిం చట్టాలను బట్టి న్యాయస్థానాలు తీర్పులు ఇవ్వవు. అధికసంఖ్యాకుల మతపరంగా తయారు చేసుకున్న చట్టాల పరంగానే తీర్పులు ఉంటాయి. ఇక్కడ మనం హిందువులకు ప్రాధాన్యమివ్వటం లేదు కనుక రకరకాలమతాలవారి న్యాయసూత్రాల ప్రకారం తీర్పులుంటాయి. అక్కడి లౌకికవాదం తీసుకువచ్చి మన దేశంలో ఇంప్లాంట్ చేయాల్సిన అవసరంలేదు. మన దేశంలో పురోహిత వర్గం అసలు రాజకీయాల్లో జోక్యం చేసుకున్నదెప్పుడు? వాళ్ళెప్పుడూ మతప్రవచనాలకూ, వాళ్ళల్లో వాళ్ళు కాట్లాడుకోటానికే పరిమితమయ్యారు తప్ప, రాజకీయాల్లో ఎప్పుడూ జోక్యం కలిగించుకో లేదు. అయితే, ఈ లౌకికవాదం హిందువుల విషయంలోనే వర్తిస్తుంది తప్ప, మిగతామతస్థుల విషయాల్లో కాదు, వారి విషయాలు పాలకులకవసరం లేదు. అక్కడీ లౌకికవాదం పనిచేయదు. అన్నీ ఓట్ల రాజకీయాలు! నేను ఈ మాట అంటాననే సుదర్శనానికి